# శ్రీ కల్లూరు సుబ్బారావు

శ్రీ కల్లూరు సుబ్బారావు శాసనసభ (1955-1962) డెప్యూటీ స్పీకర్‌గా 1955, ఏప్రిల్ 27న ఏకగ్రీవంగా ఎన్నికై 1957 ఏప్రిల్ 15 వరకు ఆ పదవిని నిర్వహించారు.

రాయలసీమ కురు వృద్ధుడిగా పేరు గాంచిన పద్మశ్రీ శ్రీ కల్లూరి సుబ్బారావు 1897వ సంవత్సరము అనంతపురం జిల్లా హిందూపూర్ సమీపంలోని కల్లూరు గ్రామంలో జన్మించారు.

శ్రీ సుబ్బారావు తెలుగు భాషలో విద్వాన్ పట్టా పొంది కొంతకాలం ఉపాధ్యాయునిగా పనిచేశారు. చిన్నతనం నుండే విశిష్టమైన దేశభక్తి భావాలు కల్గిన వ్యక్తి సుబ్బారావు గారు. 1918వ సంవత్సరములో గాంధీగారి ప్రసంగాలతో ప్రభావితులై ఖద్దరు వస్త్రాలను మాత్రమే ధరిస్తూ ఇంటింటా గాంధీజీ సందేశాన్ని ప్రచారం చేసారు. శ్రీమతి అనిబెసెంట్ ప్రారంభించిన హోమ్ రూల్ ఉద్యమంలో వీరు పాల్గొన్నారు. 1921వ సంవత్సరములో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నందుకు వీరిని హిందూపూర్‌లో అరెస్టు చేసి 10-12-1921 నుండి 09-12-1922 వరకు తిరుచినాపల్లి, కడలూరు జైళ్ళలో ఉంచారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు వీరు 13-10-1930 నుండి బళ్ళారి, తిరుచినాపల్లి జైళ్ళలో ఒక సంవత్సరం పాటు జైలు శిక్షను అనుభవించారు. 1932వ సంవత్సరములో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు 11-01-1932 నుండి ఒక సంవత్సరం పాటు బళ్లారి, కోయంబత్తూరు జైళ్ళలో కఠిన కారాగార శిక్షను అనుభవించారు. 1940-1941 సంవత్సరములో గాంధీజీ ప్రారంభించిన వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మరొకసారి జైలుశిక్షను అనుభవించారు. 1942 నుండి 1944 వరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని వెల్లూరు, నాగపూరు, అమరావతి జైళ్ళలో శిక్షను అనుభవించి తన సుదీర్ఘమైన జైలు జీవితాన్ని జ్ఞానసముపార్జనకు ఉపయోగించుకొని 'ప్రిజన్ గ్రాడ్యుయేట్' అని పేరు గాంచారు.

వీరు 1937 సంవత్సరములో మద్రాసు శాసనసభ సభ్యుడిగా ఉన్నారు. 1937వ సంవత్సరము నవంబరు 16న రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణ కోసం జరిగిన శ్రీబాగ్ ఒప్పందంపై సంతకం చేసిన వారిలో శ్రీ కల్లూరు సుబ్బారావు ఒకరు. వీరు 1946వ సంవత్సరంలో మద్రాసు శాసనసభ నుండి రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా ఎన్నికైనారు.

శ్రీ కల్లూరు సుబ్బారావు 1955వ సంవత్సరములో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు అనంతపురం జిల్లా హిందుపూర్ నియోజకవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు.

శ్రీ సుబ్బారావు మంచి వక్త. ఆయన శాసనసభలో, ప్రజావేదికలపై చేసే ప్రసంగాలు విజ్ఞానదాయకంగాను, గంభీరంగాను, సందేశాత్మకంగాను ఉండేవి. శ్రీ సుబ్బారావు లేపాక్షి శిల్ప కళావైభవాన్ని వెలుగులోనికి తెచ్చేందుకు విశేషమైన కృషి చేశారు. వీరి కృషి వల్లనే నేడు లేపాక్షి శిల్ప సంపద సజీవంగా అలరారుతున్నది. 1967వ సంవత్సరములో వీరికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదును ఇచ్చి సత్కరించినది.

సుమారు అర్ధశతాబ్దం పాటు రాజకీయ, సామాజిక, సాహితీ, కళారంగాలలో సేవలను అందించిన శ్రీ కల్లూరు సుబ్బారావు 1973, డిసెంబరు 20న మరణించారు.